

రసవత్తరంగా పోటీలు

నూజివీడు డీఏఆర్ కళాశాలలో నిర్వహిస్తున్న జాతీయ స్థాయి బాస్కెట్‌బాల్ పోటీలు రసవత్తరంగా సాగుతున్నాయి. క్వార్టర్స్‌లో జట్లు సోమవారం హోరాహోరీగా తలపడ్డాయి. 8లో



ఉత్తమ నాటికగా (అ)సత్యం

ఈనెల 10వ తేదీ నుంచి రాయకుదురులో నిర్వహిస్తున్న జాతీయస్థాయి నాటిక పోటీల్లో మొదటి ఉత్తమ ప్రదర్శనగా చైతన్య కళాస్రవంతి వారి (అ)సత్యం నాటిక నిలిచింది. 8లో



వేరుశనగ విత్తనాల సస్యరక్షణ

వేరుశనగ కోతలు పూర్తయ్యాక జాగ్రత్తలు పాటిస్తేనే విత్తనాలు పనికివస్తాయి. పంట తగిన తేమ వచ్చే వరకు మొక్కనుంచి కాయలను వేరు చేయడానికి ముందు ఎండబెట్టాలి. 8లో

న్యూస్‌రీల్

స్మృతి వనానికి నూతన శోభ



అల్లూరి సీతారామరాజు స్మృతి వనాన్ని ప్రారంభించిన కలెక్టర్ చదలవాడ నాగరాణి

భీమవరం (ప్రకాశంచౌక్): భీమవరం జేపీ రోడ్డులోని అల్లూరి సీతారామరాజు స్మృతి వనంలో రూ.45 లక్షల వ్యయంతో ఏర్పాటు చేసిన మ్యూజికల్ ఫౌంటెన్, లైటింగ్ నడుపాయాలను కలెక్టర్ చదలవాడ నాగరాణి ఆదివారం రాత్రి ప్రారంభించారు. కేంద్ర ప్రభుత్వం సహాయ సహకారాలతో ఈ స్మృతి వనాన్ని ఏర్పాటు చేశారు. అనంతరం అభివృద్ధి కార్యక్రమాలు కొనసాగిస్తున్నారు. కలెక్టర్ నాగరాణి మాట్లాడుతూ భీమవరం అభివృద్ధిలో ఇలాంటి సుందరీకరణ ఎంతో ముఖ్యమని అన్నారు. రానున్న వేసవి నాటికి భీమవరం అభివృద్ధి కంటికి కనిపించేంత స్పష్టత వస్తుందని కలెక్టర్ తెలిపారు.

వశిష్ట గోదావరికి పంచ హారతులు



సిద్ధాంతంలో వశిష్ట గోదావరికి హారతులిస్తున్న భక్తులు

పోడూరు : సిద్ధాంతంలో వశిష్ట గోదావరి వద్ద సోమవారం రాత్రి పౌర్ణమి సందర్భంగా హిందూ ధర్మ పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో కటికి ప్రసాదు, తులసి చంద్రిక దంపతులచే గోదావరి మాతకు పంచ హారతులు నిర్వహించారు. వేదమూర్తులు కలగబద్రుడు, స్వామి బ్రాహ్మణత్వంతో ఏకముఖ, ద్విముఖ, చతుర్ధ, పంచమ, కుంభ, నక్షత్ర, పూర్ణకుంభ, సర్ప హారతుల కార్యక్రమం జరిగింది.

కనుల పండువగా గోదా రంగనాథుల కల్యాణం

ద్వారకాతిరుమల: శ్రీవారి క్షేత్రంలో శ్రీ గోదా, రంగనాథుల కల్యాణ వేడుక సోమవారం ఉదయం కనుల పండువగా జరిగింది. శ్రీ రంగనాథుని భక్తురాలైన గోదాదేవి ధనుర్మాసంలో నెల రోజులపాటు పాసురాల ద్వారా స్వామివారిని కీర్తించి, ఆ తర్వాత వివాహమాడతారు. ఆ వేడుకను స్వామివారి నిత్యార్జిత కల్యాణంతో పాటు, గోదాదేవిని ఉంచి అర్చకులు కల్యాణ తంతును వైభవోపేతంగా జరిపారు. మాంగల్యధారణ, తలంబ్రాలు వేడుకను ఘనంగా జరిపారు.



భీమవరం మండలం దేగాపురంలో బరి వద్ద ప్రత్యేక స్టాళ్లు



భీమవరం మండలం దేగాపురంలో కాలు దువ్వుతున్న పందెం కోళ్లు

బరిలో పందెంకోడీ

- మూగబోయిన పోలీసుల మైకులు
- పైచేయి సాధించిన పందెంరాయుళ్లు
- జిల్లా వ్యాప్తంగా బరుల వద్ద కోడిపందేలు, గుండాట, పేకాట నిర్వహణ
- మద్యం స్టాళ్లు ఏర్పాటుచేసి భారీగా అమ్మకాలు
- బరులను ప్రారంభించిన కూటమి నేతలు
- తొలి రోజే రూ.100 కోట్లకు పైగా చేతులు మారిన నగదు

సాక్షి, భీమవరం : పోలీసుల హెచ్చరికలను బేఖాతరు చేస్తూ పందెంరాయుళ్లు సంక్రాంతి పోటీల్లో పైచేయి సాధించారు. జిల్లా వ్యాప్తంగా సోమవారం వందకు పైగా బరుల్లో కోడిపుంజుల కాళ్లకు కత్తులు కట్టి పందేలకు తెరలేపారు. వాటిమాటున గుండాట, పేకాట, ఇతర జూద కార్యకలాపాలను యథేచ్ఛగా నిర్వహిస్తున్నారు. కూటమి ప్రజాప్రతినిధులు దగ్గరుండి పందేలను ప్రారంభించారు. జిల్లా వ్యాప్తంగా మొదటి రోజునే రూ. 100 కోట్లకు పైగా నగదు చేతులు మారుతుందని అంచనా.

సంక్రాంతి పండుగల పేరిట కోడి పందేలు నిర్వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామన్న పోలీస్ మైకులు మూగబోయాయి. జిల్లా వ్యాప్తంగా ఎక్కడ చూసినా కోడిపందేల జోరు కనిపించింది. గత ఏడాదితో పోలిస్తే ఈ ఏడాది జిల్లాలో అధికంగా 130 కోడిపందేల బరులు వెలిశాయి. వీటిలో పెద్ద బరులు 40 ఉండగా మిగిలినవి చిన్నబరులు.. ఆయా నియోజకవర్గాలకు చెందిన కూటమి ప్రజాప్రతినిధుల ఆధ్వర్యంలోనే టీడీపీ, జనసేన నాయకులు వేర్వేరుగా, కూటమిగా వీటిని నిర్వహిస్తున్నారు. సాధారణంగా భోగి రోజున పోలీసుల నుంచి లైన్ క్లియర్ అయినట్టు సమాచారం వచ్చాక మధ్యాహ్నం నుంచి లేదా సాయంత్రం నుంచి పందేలను ఏర్పాటుచేసేవారు. ఈ ఏడాది ఉదయం నుంచే పందేలు, గుండాట, పేకాటలను మొదటు పెట్టేవారు. ఎక్కడికక్కడ మద్యం స్టాళ్లు ఏర్పాటచేసి విచ్చలవిడిగా మద్యం అమ్మకాలు చేశారు.

నియోజకవర్గాల వారీగా..

- ఉండి నియోజకవర్గం కాళ్ల మండలం పెద అమిరంలో సంప్రదాయ కోడిపందేలను డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణంరాజు, మాజీ మంత్రి గంటా శ్రీనివాసరావు ప్రారంభించగా అనంతరం కాళ్లకు కత్తులు కట్టి పందేలు నిర్వహించారు. బరి వద్దనే కూర్చుని ఇరువురు పందేలు తిలకించారు. సీసలిలో ఏపీఐఐసీ ౘైర్మన్ మంతెన రామరాజు పందేలు ప్రారంభించారు.
- భీమవరం నియోజకవర్గంలోని డేగాపురం, కొవ్వాడ అన్నవరం, వీరవాసరం, నవుడూరు గ్రామాల్లో భారీగా పందేలు, గుండాట, పేకాటలు నిర్వహిస్తున్నారు. డేగాపురం బరి వద్దకు సోమవారం పలువురు బుల్లితెర నటులు వచ్చి పందేలు చూశారు. పందేంరాయుళ్లను ఆకర్షిస్తూ వీరవాసరం మండలంలో ఎక్కువ పందేలు గెలిచిన వారికి బంగారం, బుల్లెట్, యూనికార్న్ మోటారు సైకిళ్లను బహుమతులుగా ప్రకటించారు. రోడ్ల పక్కన, ఇళ్ల మధ్యలో విచ్చలవిడిగా పేకాటలు జరుగుతున్నాయి.
- తణుకు ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణ వేల్పూరులోని తన అనుచరులు నిర్వహిస్తున్న బరులను ప్రారంభించారు. నియోజకవర్గం వ్యాప్తంగా 22 బరులను ఏర్పాటుచేయగా తొలిరోజు రూ. 20 కోట్లకుపైగా నగదు చేతులు మారినట్టు అంచనా.
- నరసాపురంలో నియోజకవర్గంలో ఎన్నడూ లేని విధంగా 42 వరకు కోడిపందేల బరులు, గుండాటలు ఏర్పాటుచేశారు. రూ.10 వేల నుంచి రూ.5 లక్షలు వరకు కోడిపందాలు జరుగుతుండగా, గుండాట వద్ద మైనర్లు ఎక్కువగా కనిపించారు. తొలి రోజు రూ.10 కోట్లు చేతులు మారుతాయని అంచనా.
- ఆచంట నియోజకవర్గంలో పెనుగొండ, వడలి, దొంగరావిపాలెం, ఆచంట, వల్లూరుకోట, పోడూరు, కవిటం, పెనుమంత్ర, వెలగలేరు, మార్టేరు, పెనుమంత్ర, ఆలమూరు గ్రామాల్లో జోరుగా కోడిపందేలు, గుండాట, పేకాటలు జరుగుతున్నాయి.
- తాడేపల్లిగూడెం విమానాశ్రయం సమీపంలో భారీ సెట్టింగ్ వేశారు. ఎమ్మెల్యే బొలిశెట్టి బరిని సందర్శించారు. వివిధ జిల్లాలకు చెందిన పందెం రాయుళ్లు వచ్చారు. రూ. కోటి పెద్ద పందెం జరిగినట్టు తెలుస్తోంది. బరి వద్దనే భారీ స్థాయిలో గుండాట, పేకాటలు నిర్వహిస్తున్నారు.
- పాలకొల్లు నియోజకవర్గంలోని పూలపల్లిలో రెండు, వడ్లవానిపాలెంలో ఒకటి, యలమంచిలి మండలం కలగంపూడి, యలమంచిలి తదితర చోట్ల 25కు పైగా బరులను ఏర్పాటుచేసి భారీ ఎత్తున కోడి పందేలు, జూదాలు నిర్వహిస్తున్నారు.



పెదఅమిరంలో కోడిపందేలు ప్రారంభిస్తున్న డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణంరాజు, మాజీ మంత్రి గంటా శ్రీనివాసరావు



కాళ్ల మండలం పెదఅమిరంలో కోడిపందేల బరి

రూ.కోట్లలో పందేలు



పెద్ద బరుల వద్ద ఒక్కో పందె రూ.ఐదు లక్షల నుంచి రూ. 15 లక్షలు వరకు జరిగితే, ఓ మాదిరి బరుల వద్ద రూ. 50 వేల నుంచి రూ.రెండు లక్షల వరకు, చిన్న బరుల వద్ద రూ. 5 వేల నుంచి రూ.లక్ష వరకు పందేలు జరుగుతున్నాయి. రూ.లక్ష నుంచి రూ.25 లక్షల వరకు పై పందేలు జరుగుతున్నాయి. తాడేపల్లిగూడెంలో రూ.కోటి పెద్ద పందెం జరిగినట్టు సమాచారం. చిన్నా పెద్దా బరులు కలిపి తొలిరోజు రూ.వంద కోట్లకు పైగా నగదు చేతులు మారినట్టు అంచనా.



నరసాపురం వీవర్స్ కాలనీ సమీపంలో గుండాట



భీమవరం మండలం దేగాపురం వద్ద కార్ల పార్కింగ్



దెందులూరు మండలం కొవ్వలిలో భోగి మంటలు

పల్లె సంక్రాంతి



ఎడ్లబండిపై చిన్నారులు

దెందులూరు మండలం కొవ్వలి గ్రామంలో సంక్రాంతి సందర్భంగా ప్రత్యేక సంబరాలు నిర్వహించారు. గ్రామదీప్ సంస్థ ఆధ్వర్యంలో పల్లె వాతావరణం ఉట్టిపడేలా వేడుకలు జరిపారు. ఈ సందర్భంగా ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి.

– సాక్షి ఫొటోగ్రాఫర్, ఏలూరు



చిన్నారుల నృత్య ప్రదర్శన

భోగి మంటల్లో విద్యుత్ బిల్లులు

భీమవరం: రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం రాష్ట్ర ప్రజలపై మోపిన రూ.16 వేల కోట్ల విద్యుత్ చార్జీల భారాన్ని తక్షణం తొలగించాలని సీపీఐ జిల్లా కార్యదర్శి కోనాల భీమారావు డిమాండ్ చేశారు. విద్యుత్ చార్జీల పెంపు నిరసిస్తూ సీపీఐ ఆధ్వర్యంలో సోమవారం భీమవరం పట్టణంలోని నాచువారి సెంటర్లో విద్యుత్ బిల్లులు భోగి మంటల్లో వేసి దహనం చేశారు. ఈ సందర్భంగా భీమారావు మాట్లాడుతూ ఎన్నికల ముందు విద్యుత్ ఛార్జీలు తగ్గిస్తామని ప్రజలపై ఎలాంటి విద్యుత్ చార్జీల భారాలు మోపమని చెప్పిన కూటమి నాయకులు అధికారంలోకి వచ్చిన ఆరునెలల కాలంలోనే పెద్దమొత్తంలో విద్యుత్ చార్జీల భారాలు మోపడం దారుణమన్నారు. నిరసన కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు చెల్లబోయిన రంగారావు, ఎం సీతారాం ప్రసాద్, సికిలే పుష్పకుమారి, మల్లుల శ్రీనివాస్, నాగిడి శాంతమూర్తి, వైవీ ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

సీపీఐ ఆధ్వర్యంలో..

విద్యుత్ చార్జీలపై ప్రభుత్వ విధానాన్ని నిరసిస్తూ సోమవారం సీపీఎం ఆధ్వర్యంలో విద్యుత్ బిల్లులను సంక్రాంతి సందర్భంగా భోగి మంటల్లో వేసి నిరసన తెలిపారు. మారుతీ నగర్, మెంటే వారితోటలో జరిగిన నిరసన కార్యక్రమాల్లో పార్టీ జిల్లా కార్యదర్శి జెఎన్వీ గోపాలన్ మాట్లాడుతూ భోగి మంటల్లో పాత వస్తువులు వేయడం ఆచారంగా వస్తుందని నేడు ప్రభుత్వ నిర్వాకం కారణంగా గతంలో వాడుకున్న విద్యుత్‌కు ప్రస్తుతం బిల్లుల వసూలు చేసే ప్రయత్నానికి నిరసనగా విద్యుత్ బిల్లులను భోగి మంటల్లో వేసి దహనం చేస్తున్నామన్నారు. వినియోగదారుల ప్రయోజనాలను గాలికి వదిలేసి డిస్కంలు పెట్టే తప్పుడు ప్రతిపాదనలను నియంత్రణ మండలి, రాష్ట్ర ప్రభుత్వం ఆమోదించడం దారుణమని మండిపడ్డారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా కమిటీ సభ్యులు జక్కంశెట్టి సత్యనారాయణ, కె.క్రాంతిబాబు, ఆకుల హరేరాం, మల్లిపూడి ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.



భీమవరంలో సీపీఐ ఆధ్వర్యంలో నిరసన



సీపీఎం ఆధ్వర్యంలో భోగి మంటలో విద్యుత్ బిల్లులు వేసి దహనం చేస్తున్న దృశ్యం

కలెక్టర్ బంగ్లాలో భోగి మంటలు



కలెక్టర్ బంగ్లాలో నిర్వహించిన భోగి వేడుకలు

భీమవరం (ప్రకాశంచౌక్): సంక్రాంతిని పురస్కరించుకొని సోమవారం కలెక్టర్ బంగ్లాలో భోగి మంటలను కలెక్టర్ చదలవాడ నాగరాణి పూజా కార్యక్రమాలు నిర్వహించి ప్రారంభించారు. వేడుకల్లో ఎస్పీ అద్నాన్ నయీం అస్మి పాల్గొన్నారు. భోగి మంటలు కనువిందు చేయగా, గంగిరెద్దులు సందడి చేశాయి. ఈ సందర్భంగా కలెక్టర్ నాగరాణి మాట్లాడుతూ సంక్రాంతి పండుగతో జిల్లాలోని ప్రతి ఇంట సిరులు వెల్లివిరియాలని కోరుకుంటున్నట్లు చెప్పారు .

క్లుప్తంగా

రైలు ప్రమాదంలో గుర్తు తెలియని వ్యక్తి మృతి

ఏలూరు (టూటౌన్): రైలు ప్రమాదంలో గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందాడు. ఏలూరు రైల్వే ఎస్సై సైమన్ తెలిపిన వివరాల ప్రకారం ఏలూరు రైల్వే పోలీస్ స్టేషన్ పరిధిలో, నూజివీడు రైల్వే స్టేషన్ సమీపంలో గుర్తు తెలియని రైలు ఢీకొని వ్యక్తి మృతి చెందాడు. మృతుడి వయస్సు సుమారు 50–55 సం.ల వయస్సు ఉంటుంది. లేత బిస్కెట్ రంగు చొక్కా, ముక్కు పొడుం రంగు డ్రాయర్ ధరించి ఉన్నాడు. మృతదేహాన్ని ఏలూరు సర్వజన ప్రభుత్వ ఆస్పత్రికి తరలించామని, వివరాలు తెలిసిన వారు సెల్ 99892 19559 నంబర్‌లో సంప్రదించాలని రైల్వే ఎస్సై సైమన్ కోరారు.

లారీ ఢీకొని మహిళ మృతి

కొయ్యలగూడెం: లారీ ఢీకొని యర్రంపేట (గొల్లగూడెం) గ్రామానికి చెందిన మహిళ మృతి చెందినట్లు ఎస్సై వి.చంద్రశేఖర్ సోమవారం తెలిపారు. వామిశెట్టి సుబ్బలక్ష్మి (64) ఉదయం పాలు తీసుకురావడానికి వెళ్లి ఇంటికి తిరిగి వస్తుండగా అతి వేగంగా వచ్చిన లారీ వెనక నుంచి ఢీకొంది. సుబ్బలక్ష్మిపై నుంచి లారీ వెళ్లడంతో శరీరం గుర్తుపట్టలేని విధంగా ఛిద్రం అయిందని ఎస్సై తెలిపారు. గ్రీన్ ఫీల్డ్ హైవే పనులను నిమిత్తం వచ్చిన లారీగా గుర్తించామని దీనికి సంబంధించి డ్రైవర్‌ను అదుపులోకి తీసుకున్నట్లు చెప్పారు. మృతురాలు సుబ్బలక్ష్మి కుమారుడు సత్యనారాయణ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై చెప్పారు.

భారీ కొండ చిలువ హతం



హతమార్చిన కొండచిలువ ఇదే

పెంటపాడు: రావిపాడు గ్రామంలో సోమవారం భారీ కొండ చిలువను గ్రామస్తులు హతమార్చారు. తొలుత వెంకయ్యకాలువ సమీపంలో పశువుల పాకవద్దకు చేరిన సుమారు 10 అడుగుల కొండచిలువను చూసి స్థానికులు భయబ్రాంతులకు గురయ్యారు. పశువులు, కోళ్ల వద్దకు వేగంగా తిరుగాడుతున్న కొండచిలువను స్థానికులలో కొందరు ధైర్యం చేసి హతమార్చారు. చిన్నారులు, ప్రయాణికులు సెల్ఫీలు తీసుకొంటూ వింతగా తిలకించారు. అనంతరం ఆ కొండచిలువకు కాలువ గట్టున అంత్యక్రియలు నిర్వహించారు. ప్రధానంగా రావిపాడు గ్రామంలో వెంకయ్య కాలువ పరివాహక ప్రాంతాలలో చిలకంపాడు లాకుల వరకు కొండచిలువలు ఉన్నట్లు ప్రయాణికులు చెబుతున్నారు.

నూజివీడు చిన్న రసానికి పేటెంట్ హక్కు కల్పించాలి

నూజివీడు: దేశంలోనే పేరు ప్రఖ్యాతలు సాధించిన నూజివీడు చిన్న రసానికి పేటెంట్ హక్కు కల్పించాలని అఖిల భారత కిసాన్ మహాసభ రాష్ట్ర కార్యదర్శి డి హరినాథ్ సోమవారం ఒక ప్రకటనలో ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో 10.75 లక్షల ఎకరాల్లో మామిడి పంట సాగవుతోందని మామిడి ఎగుమతిలో ఉత్తర ప్రదేశ్ ప్రథమ స్థానంలోనూ, ఆంధ్రప్రదేశ్ రెండో స్థానంలోనూ ఉన్నాయని పేర్కొన్నారు. భూసార పరీక్ష కేంద్రాన్ని నూజివీడులో ఏర్పాటు చేయాలని, మామిడి పరిశోధన కేంద్రానికి 100 ఎకరాలు కేటాయించాలని, 70 శాతం రాయితీ మీద ట్రేడింగ్ షెడ్లు, డ్రిప్ ఇరిగేషన్ పథకాలు మంజూరు చేయాలని హరినాథ్ కోరారు. మామిడి సీజన్‌లో ఉపాధి హామీ పథకాన్ని మామిడి పంటకు అనుసంధానం చేయాలని కోరారు. నూజివీడు నుంచి ఏలూరు తరలించిన ఉద్యానశాఖ ఏడీ ఆఫీసును తిరిగి నూజివీడులో ఏర్పాటు చేయాలన్నారు.

రసవత్తరంగా బాస్కెట్‌బాల్ పోటీలు

నేడు మహిళల, పురుషుల సెమీస్, ఫైనల్ పోటీలు



ఏపీ పోలీస్, నెల్లూరు జట్ల మధ్య ఆసక్తికరంగా బాస్కెట్‌బాల్ మ్యాచ్

నూజివీడు: నూజివీడు డీఏఆర్ కళాశాలలో ఈనెల 12 నుంచి నిర్వహిస్తున్న రాజా వెంకటాద్రి అప్పారావు బహద్దూర్ 48వ స్మారక పురుషుల, మహిళల జాతీయ స్థాయి బాస్కెట్‌బాల్ పోటీలు రసవత్తరంగా సాగుతున్నాయి. లీగ్ కం నాకౌట్ పద్ధతిలో నిర్వహించిన ఈ పోటీల్లో లీగ్ మ్యాచ్‌లు ముగిసి, క్వార్టర్స్‌కు చేరిన జట్లు సోమవారం హోరాహోరీగా తలపడ్డాయి. పలు జట్లలో క్రీడాకారులు తమ అత్యుత్తమ ప్రతిభను కనబర్చి తమ జట్లను విజయపథంలో నడిపించారు. మహిళల విభాగంలో సెయింట్ ఫ్రాన్సిస్ హైదరాబాద్, ఏలూరు, వీటీహెచ్ నూజివీడు, డీఎస్ఏ పల్నాడు జట్లు సెమీఫైనల్స్‌కు చేరాయి. సెయింట్ ఫ్రాన్సిస్ జట్టు సీబీసీ రాజమండ్రిపై 33–18 తేడాతో, ఏలూరు జట్టు స్వస్తిక్ హైదరాబాద్‌పై 32–23 తేడాతో, వీటీహెచ్ జట్టు గుడివాడపై 25–12 తేడాతో, డీఎస్ఏ పల్నాడు జట్టు చిత్తూరుపై 31–25 తేడాతో గెలుపొంది సెమీఫైనల్స్‌కు చేరాయి. పురుషుల క్వార్టర్స్ ఫైనల్స్ మ్యాచ్‌ల్లో ఏపీ పోలీస్, హెచ్ ఫౌండేషన్ గుంటూరు, లయోల హైదరాబాద్, స్వస్తిక్ హైదరాబాద్ జట్లు ఫైనల్స్‌కు చేరాయి. ఏపీ పోలీస్ జట్టు నెల్లూరుపై 51–37 తేడాతో, హెచ్ ఫౌండేషన్ జట్టు వీజీ బౌలర్స్ హైదరాబాద్‌పై 45–28 తేడాతో, లయోలా హైదరాబాద్ జట్టు గుంటూరుపై 50–41 తేడాతో, స్వస్తిక్ హైదరాబాద్ జట్టు జీ మామిడాడపై 63–47 స్కోర్ తేడాతో గెలుపొంది సెమీఫైనల్స్‌కు చేరాయి. ఈనెల 14న పురుషుల, మహిళల సెమీస్, ఫైనల్స్ మ్యాచ్‌లతో పాటు మూడు, నాలుగు స్థానాలకు మ్యాచ్‌లను నిర్వహించనున్నారు. ఈ పోటీల నిర్వహణను ఆర్గనైజింగ్ సెక్రటరీ పసుపులేటి సాధన పర్యవేక్షించారు. బాస్కెట్‌బాల్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా రిఫరీలు పోటీలను నిర్వహించారు.

ఏపీ టీం కంటింజెంట్ చీఫ్‌గా వెంకట్రామయ్య



వెంకట్రామయ్య

ఏలూరు రూరల్: జాతీయ క్రీడల కోసం ఆంధ్రప్రదేశ్ టీమ్ కంటింజెంట్ చీఫ్ డి మిషన్‌గా బడేటి వెంకట్రామయ్య నియామక మయ్యారని ఏపీ వెయిట్‌లిఫ్టింగ్ అసోసియేషన్ కార్యదర్శి దినేష్‌బాబు ఓ ప్రకటనలో తెలిపారు. జనవరి 28 నుంచి ఫిబ్రవరి 14 వరకూ ఉత్తరాఖండ్ రాష్ట్రంలోని 9 నగరాల్లో 35వ జాతీయ క్రీడలు జరగనున్నాయని పేర్కొన్నారు. ఇందుకోసం ఈ నెల 14, 15 తేదీల్లో డెహ్రాడూన్‌లో ప్రత్యేక సమావేశం జరగనుందని వివరించారు. ఈ సమావేశానికి ఆంధ్రప్రదేశ్ టీమ్ కంటింజెంట్ చీఫ్ ది మిషన్‌గా నియమితులైన వెంకట్రామయ్య హాజరుకానున్నట్లు తెలిపారు. జాతీయ పోటీల్లో మొత్తంగా 21 క్రీడాంశాల్లో రాష్ట్ర జట్లు పాల్గొననున్నాయి. ఒక్కొక్క క్రీడాంశానికి చీఫ్ డి మిషన్‌గా నియమిస్తారు. ఇండియన్ వెయిట్‌లిఫ్టింగ్ అసోసియేషన్ ఉపాధ్యక్షులుగా, 2011లో జరిగిన కామన్‌వెల్త్ క్రీడల్లో వెయిట్ లిఫ్టింగ్ డిప్యూటి కాంపిటేషన్ మేనేజర్‌గా సేవలు అందించిన బడేటిని మరోసారి డి మిషన్‌గా నియమించారని పేర్కొన్నారు.

జాతీయస్థాయి ఉత్తమ నాటికగా (అ)సత్యం

- ముగిసిన జాతీయస్థాయి నాటిక పోటీలు
- కళాకారులకు సత్కారాలు



జాతీయస్థాయి నాటిక పోటీల్లో నటులకు సత్కారాలు చేస్తున్న నిర్వాహకులు

వీరవాసరం: శ్రీకృష్ణదేవరాయ నాటిక కళా పరిషత్ ఆధ్వర్యంలో ఈనెల 10వ తేదీ నుంచి రాయకుదురులో నిర్వహిస్తున్న పంచమ జాతీయస్థాయి నాటిక పోటీలు సోమవారం ముగిశాయి. ఈ సందర్భంగా విజేతల వివరాలను ప్రకటించి బహుమతులను అందజేశారు. మొదటి ఉత్తమ ప్రదర్శనగా చైతన్య కళాస్రవంతి ఉక్కునగరం వారి (అ)సత్యం నాటిక సాధించగా, ద్వితీయ ఉత్తమ ప్రదర్శనగా శార్వాణీ ఫైన్ ఆర్ట్స్ బోరువంక వారి కొత్తపరిమళం నాటిక, తృతీయ ఉత్తమ ప్రదర్శనగా నటీనట సంక్షేమ సమైఖ్య పాలకొల్లువారి ×అనూహ్యం× నాటికలు నిలిచాయని కళాపరిషత్ అధ్యక్షుడు గోపాలకృష్ణ కేఎస్ఆర్‌కే తెలిపారు. ఉత్తమ దర్శకత్వం (అ)సత్యం నాటికకు బాలాజీ నాయక్, ఉత్తమ రచనగా పిన్నమనేని మృత్యుంజయరావు, ఉత్తమ నటుడు కొత్తపరిమళం నాటిక డాక్టర్ గోపాల్ పాత్రధారి మెట్టా పోలినాయుడు, ఉత్తమ నటి మలిసంధ్య నాటికలోని సంధ్యా పాత్రధారి జ్యోతిరాణి, ఉత్తమ క్యారెక్టర్ నటుడు చిగురుమేఘం నాటికలోని చెన్నయ్య పాత్రధారి కావూరి సత్యనారాయణ, ఉత్తమ ప్రతినాయకుడు కొత్తపరిమళం నాటికలోని ఉస్మాన్‌ఖాన్ పాత్రధారి ఎస్ వెంకట్రాజు, ఉత్తమ హాస్యనటుడు అనూహ్యం నాటికలోని ధనుష్కోటి పాత్రధారి గుడాల హరిబాబు, ద్వితీయ ఉత్తమ నటుడు విడాకులు కావాలి నాటికలోని శ్రీనివాసరావు పాత్రధారి గంగోత్రి సాయి, ఉత్తమ సంగీతం కొత్తపరిమళం నాటిక డీ రాజశేఖర్, ఉత్తమ రంగాలంకరణ చిగురు మేఘం నాటిక రామ్మోహన్, ఉత్తమ ఆహార్యం కొత్తపరిమళం నాటికలోని ఎస్ రమణ ఎంపికయ్యారు. న్యాయ నిర్ణేతలుగా అల్లు రామకృష్ణ, కొడమంచిలి సత్యప్రసాద్, గంటా ముత్యాలరావు నాయుడు వ్యవహరించారు. ముందుగా మందుల స్మారక రంగస్థలం నటరత్న అవార్డుతో గంగోత్రి సాయిని సత్కరించారు. గోటేటి ప్రసాద్ శ్రీనివాసరావుల స్మారక నటరత్న అవార్డు కత్తుల రామ్మోహనరావుకు అందజేసి ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో హైకోర్టు సీనియర్ న్యాయవాది జీ శివకుమార్, గోటేటి శ్రీనివాసరావు, సర్పంచ్ గెద్దం భారతీ, చవ్వాకుల సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

వాయు త్రిలింగ క్షేత్రంలో ప్రత్యేక పూజలు



ప్రత్యేక అలంకరణలో శివదేవుడు

పాలకొల్లు అర్బన్: వాయుత్రిలింగ క్షేత్రంగా ప్రసిద్ధి చెందిన శివదేవుని చిక్కాలలోని శ్రీపార్వతీ సమేత శ్రీశివదేవ స్వామి ఆలయంలో ఆరుద్ర నక్షత్రం, పౌర్ణమి, సోమవారం పురస్కరించుకుని భక్తులు పెద్ద సంఖ్యలో స్వామివారిని దర్శించుకున్నారు. అమ్మవారికి ప్రత్యేక కుంకుమ పూజలు చేశారు. సంతాన ప్రాప్తి కోసం భక్తులు ఆలయ ఆవరణలో కొబ్బరి మొక్కలు నాటారు. ఆలయ ఈవో కేవీ సాగర్, అర్చకస్వామి ర్యాలి సతీష్ భక్తులకు సేవలందించారు.

వైఎస్సార్ సీపీ కార్యకర్తపై దాడి



దాడిలో గాయపడిన నల్లంటి భద్రయ్య

జంగారెడ్డిగూడెం: కోడిపందాల్లో వైఎస్సార్ సీపీ కార్యకర్తపై గుండాట నిర్వాహకులు దాడికి పాల్పడ్డారు. బాధితుడు తెలిపిన వివరాలివి. పేరంపేట గ్రామంలో నిర్వహిస్తున్న కోడిపందాలను చూడటానికి వైఎస్సార్‌సీపీ కార్యకర్త నల్లంటి భద్రయ్య వెళ్లాడు. అక్కడే గుండాట శిబిరం వద్ద జరుగుతున్న గొడవలో కలపాల నాగరాజు అనే వ్యక్తిని కొట్టడాన్ని చూసిన భద్రయ్య ఆపేందుకు ప్రయత్నించాడు. గుండాట నిర్వాహకులు, టీడీపీకి చెందిన కోడిపందాల శిబిరం కమిటీ సభ్యులు భద్రయ్యను కొట్టి గాయపర్చారు. భద్రయ్యను అతని మేనల్లుడు, చిన్నకుమారుడు జంగారెడ్డిగూడెం ఏరియా ఆసుపత్రికి తరలించి వైద్యం చేయించారు. తనపై దాడి చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని కోరుతూ భద్రయ్య పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

సంప్రదాయం ముసుగులో బాలలతో జూదాలు



సంక్రాంతి సంప్రదాయం ముసుగులో నిర్వహిస్తున్న పలు జూదాలు బాలల భవిష్యత్తును దెబ్బతీస్తున్నాయి. ద్వారకాతిరుమల మండలం పంగిడిగూడెంలోని కోడి పందేల బరి వద్ద పలువురు బాలలు డబ్బులు పెట్టి పులి, మేక ఆడుతూ కనిపించారు. మిగిలిన బరుల వద్ద సైతం ఇదే పరిస్థితి కనిపించింది. వీటిని అడ్డుకునే నాథుడు లేకపోవడంతో.. పెద్దలతో తామేమీ తీసిపోమన్నట్టుగా బాలలు ఈ జూదాల్లో జోరుగా పాల్గొన్నారు. సంప్రదాయం పేరుతో పందేల బరుల వద్ద గుండాట, పులి మేక, పేకాటలు నిర్వహించడం భావితరాలను జూదాల వైపునకు మరల్చడమేనని పలువురు అంటున్నారు. – ద్వారకాతిరుమల

వేరుశనగ విత్తనాలను భద్రపరుచుకుందాం ఇలా



మెట్ట ప్రాంతంలో వేరుశనగ కాయలను భూమి నుంచి పీకుతున్న వ్యవసాయ కూలీలు



చెట్టు నుంచి వేరుచేసిన వేరుశెనగ కాయలు

పాడి – పంట

చింతలపూడి: దేశంలో పండించే నూనె గింజల పంటల్లో వేరుశనగ పంట అతి ముఖ్యమైంది. ఇటీవల మెట్ట ప్రాంతంలో వేరుశనగ విస్తీర్ణం బాగా పెరిగింది. వేరుశనగ కోతలు పూర్తయ్యాక సరైన జాగ్రత్తలు పాటిస్తేనే రాబోవు కాలంలో విత్తనాలు పనికివస్తాయి. లేదంటే పుచ్చుపట్టి పనికి రావు. వేరుశనగ లో కోసిన పంటను తగిన తేమ (9 శాతం) వచ్చే వరకు మొక్క నుంచి కాయలను వేరు చేయడానికి ముందు ఎండబెట్టాలి. వేరుశనగ విత్తనాలను భద్రపరుచుకుని వచ్చే పంటకు ఉపయోగించుకోవడంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలను గురించి వ్యవసాయ శాఖ సహాయ సంచాలకులు బి నాగకుమార్ రైతులకు సూచించారు.

వేరుశనగ ఎండబెట్టే విధానం

ఇది రెండు రకాలుగా చేయవచ్చు. వేరుశనగ కాయలు పై భాగానికి వచ్చేటట్లు చెట్లను చిన్న, చిన్న కుప్పలుగా వేయాలి. లేదా మొక్కలను కర్రలకు కట్టి కాయలను పక్కలకు వచ్చేటట్లుగా చేసి ఎండబెట్టుకోవచ్చు.

తేమశాతం తగ్గించడం ఇలా..

కాయల్లో తేమ శాతం ఎక్కువగా ఉంటే ఎండలో ఆరబెట్టకుండా తేమను 7, 8 శాతానికి తీసుకురావాలి. వేడిగాలులను వదిలే పరికరాలను ఇందుకు ఉపయోగించవచ్చు. వేరుశెనగ పంటను నిల్వ చేయడానికి ఒకసారి వాడిన సంచులను మరలా వాడకూడదు. పాలిథిన్ పేపర్ ఉన్న గోనె సంచులు బాగా ఎండిన వేరుశనగ కాయలను నిల్వ చేయడానికి ఉపయోగం.

ఎండలో ఆరబెట్టకూడదు

ఖరీఫ్ సీజన్‌లో ఉష్ణోగ్రతలు పర్వాలేదనిపించినా, రబీ కాలంలో వేరుశనగ కాయలు పీకేటప్పుడు వాతావరణం ఉష్ణోగ్రత 40 డిగ్రీల సెంటీగ్రేడ్ కంటే ఎక్కువ ఉంటుంది. కాబట్టి కాయలను నేరుగా ఎండలో ఆరబెట్టకూడదు. నీడలో ఆరబెట్టాలి. లేదా ఎండ తీవ్రత ఉదయం 11 గంటల వరకు సాయంత్రం 4 గంటల తరువాత తక్కువగా ఉంటుంది కాబట్టి ఆయా సమయాల్లో ఆరబెట్టుకోవాలి. ఎండబెట్టే సమయంలో వేరే రకాల కాయలు కలవ కుండా చూసుకోవాలి.

వేరుశనగ కాయలను నిల్వ చేసుకునే విధానం

వేరుశనగ విత్తనం కోసం బాగా ముదిరిన కాయలను నిల్వ చేసుకోవాలి. కాయలను కదిలిస్తే గల్లుమని శబ్దం రావాలి. అప్పుడే బాగా ఎండినట్లు అర్థం. కాయలను నిల్వ చేసుకోవడానికి శుభ్రమైన లోపల పాలిథిన్ లైనింగ్ ఉన్న గోనె సంచులను వాడాలి. గోనె సంచులను 0.5 శాతం మలాథియాన్ ద్రావణంలో ముంచి బాగా ఆరబెట్టుకోవాలి. దీనివల్ల కాయల్లోని గింజలకు శిలీంద్రాల బెడద ఉండదు.



బి నాగకుమార్, సహాయ వ్యవసాయ సంచాలకులు, చింతలపూడి

రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి

కొయ్యలగూడెం: రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడు మృతి చెందాడు. పోతవరం గ్రామానికి చెందిన చింతలపూడి హనుమ కళ్యాణ్ (21) మరో ఇద్దరు మిత్రులతో కలిసి ఒకే బైక్‌పై కొయ్యలగూడెం నుంచి పోతవరం వెళుతుండగా అరిపాటి దాటిన తరువాత కోళ్ల ఫారం సమీపంలో మోటార్ బైక్ అదుపుతప్పి పడిపోయింది. ఈ ప్రమాదంలో హనుమ కళ్యాణ్ మృతి చెందగా అతడి స్నేహితులకు గాయాలయ్యాయని బంధువులు తెలిపారు.

దళితుల నిరసన ర్యాలీ



గ్రామ్‌దీప్ మనోహరి దిష్టిబొమ్మను దహనం చేస్తున్న దళిత నేతలు

దెందులూరు: దళితులను ఇబ్బందులకు గురిచేస్తున్న గ్రామదీప్ నిర్వాహకురాలు మనోహరిని వెంటనే అరెస్ట్ చేయాలని డిమాండ్ చేస్తూ సోమవారం కొవ్వలిలో దళితులు నిరసన ర్యాలీ నిర్వహించారు. కొవ్వలి గ్రామానికి చెందిన దళిత సంఘాల నాయకులు, గ్రామస్తులు, మహిళలు 300 మంది ప్లకార్డులు పట్టుకుని ర్యాలీలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా విలేకరుల సమావేశంలో దెందులూరు మండల వైస్ ఎంపీపీ గొల్ల నాగరాజు, కొవ్వలి దళిత పెద్దలు మాట్లాడుతూ దశబ్దాల నుంచి తమ పూర్వీకులు కొవ్వలిలో ఒక పంటను సాగు చేసుకుని జీవిస్తున్నారన్నారు. మారిన పరిస్థితులకనుగుణంగా కుటుంబపోషణ భారంగా ఉండటంతో గత రెండు సంవత్సరాలుగా రెండో పంటను సైతం సాగు చేసుకుంటున్నామన్నారు. పేదలందరికీ 10 సెంట్లు , 20 సెంట్లు మాత్రమే ఉందని వాటిలో కేవలం సాగు చేసుకుని జీవనాధారం పొందుతుంటే గ్రామదీప్ నిర్వాహకురాలు మనోహరి పర్యావరణం కాలుష్యం, తాగునీరు దెబ్బతింటున్నాయంటూ ఇలా ఏవేవో సాకులు చెబుతూ కోర్టులకి వెళుతూ దాదాపు 700 మంది పేద దళితుల జీవనాన్ని రోడ్డుపై పెట్టారన్నారు. ప్రభుత్వం, కోర్టులు జోక్యం చేసుకుని క్షేత్రస్థాయిలో వాస్తవ పరిస్థితులు తెలుసుకోవాలన్నారు. పేద దళితులను ఇబ్బందులు పెడుతున్న గ్రామ్‌దీప్ నిర్వాహకురాలు మనోహరిని అరెస్టు చేసి చర్యలు తీసుకోవాలని కోరారు. గ్రామ పెద్దలు బూసి ఏడ్రాయూ, కీర్తిరాజు, కాటి అర్జున్ కృష్ణ, ప్రత్తిపాటి సుధాకరరావు, మహిళలు, యువత పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

క్లుప్తంగా

దుస్తుల పంపిణీ



అత్తిలిలో పేదలకు చీరలు అందజేస్తున్న కూసంపూడి మూర్తి

అత్తిలి: సామాజిక సేవా కార్యక్రమాలలో భాగంగా రెల్లికులస్తులకు కూసంపూడి మూర్తి అందిస్తున్న సహాయ సహకారాలు మరువరానివని రెల్లి సంఘ సభ్యులు పేర్కొన్నారు. సంక్రాంతి పర్వదినాన్ని పురస్కరించుకుని అత్తిలి కూసంపూడి పెదకాపు పార్కులో కూసంపూడి మూర్తి భారీ కేకును కట్‌చేసి మహిళలు, పిల్లలకు అందజేసారు. అనంతరం మూర్తి సౌజన్యంతో రెల్లి మహిళలకు చీరలను పంపిణీ చేశారు. మూర్తి తన సంపాదనలో కొంత మేర సామాజిక సేవా కార్యక్రమాలకు వెచ్చిస్తున్నారని, ప్రతీ ఏడాది క్రమం తప్పకుండా మూర్తి కుటుంబం రెల్లిలకు దుస్తులు అందజేయడం ఆనందంగా ఉందని రెల్లి సంఘ పెద్దలు పేర్కొన్నారు. రెల్లిలకు ఎల్లప్పుడూ అండగా నిలుస్తూ సేవలు అందజేస్తున్న మూర్తిని రెల్లి సంఘం తరపున అభినందించి సత్కరించారు.

ఘనంగా గోదాదేవి కల్యాణం



వాసవి ఆలయంలో ప్రత్యేక పూజలు చేస్తున్న ఆర్యవైశ్యులు

తాడేపల్లిగూడెం (టీఓసీ): పట్టణంలోని వాసవి కన్యకా పరమేశ్వరి పంచాయతన క్షేత్రంలో లక్ష్మీనారాయణ స్వామికి భోగి పురస్కరించుకొని సోమవారం ఉదయం మూల విరాట్‌కు ఫలరసాలతో, సుగంధ ద్రవ్యాలతో అభిషేకాలు జరిగాయి. స్వామి వారికి విశేష అలంకరణ చేశారు. ఉమా చంద్రశేఖర్ స్వామికి, వాసవి అమ్మవారికి అభిషేకాలు, ప్రత్యేక పూజలు జరిగాయి. అనంతరం గోదాదేవి కల్యాణం ఆర్యవైశ్య సంఘం సభ్యులు కొర్లపర రాము, నున్న బాల త్రిపుర సుందరరావు, అప్పారావు, భోగవిల్లి రమేష్, కొండూరి రాము, హనుమంతరావు, ఆలపాటి సత్యనారాయణ, పచ్చిపులుసు శారదారాణి, కనకదుర్గ, నాగలక్ష్మి, తదితరులు పూజా కార్యక్రమంలో పాల్గొన్నారు.

శ్రీకృష్ణ యోగ ధ్యాన మందిరంలో..

ధనుర్మాసం ముగింపు భోగి రోజు సందర్భంగా స్థానిక రామచంద్రరావుపేటలోని శ్రీకృష్ణ యోగ ధ్యాన మందిరంలో సోమవారం గోదా, రంగనాథ కల్యాణం వైభవంగా నిర్వహించారు. మందిర కార్యదర్శి ఇందుకూరి మోహన్‌రాజు కార్యక్రమాలను పర్యవేక్షించారు.

పేదలకు నిత్యావసర సరుకుల పంపిణీ



పేదలకు నిత్యావసర వస్తువులు అందజేస్తున్న దృశ్యం

అత్తిలి: సంక్రాంతి పర్వదినాన్ని పురస్కరించుకుని చారిటీ బాక్సు ఆధ్వర్యంలో నిరుపేదలకు నిత్యావసర సరుకులను అందజేసారు. అత్తిలి మండలం కె సముద్రపుగట్టు గ్రామంలో పేద కుటుంబాలకు 15 రకాల నిత్యావసర వస్తువులను కిలో చొప్పున పంపిణీ చేశారు. ఈ సందర్భంగా చారిటీ బాక్సు ప్రతినిధి భీముడు శ్రీమణికంఠ మాట్లాడుతూ సంక్రాంతి సందర్భంగా చారిటీ బాక్సు తరపున రాష్ట్రవ్యాప్తంగా పలు గ్రామా లలో పేదలకు నిత్యావసర వస్తువులను అందజేస్తున్నామన్నారు. తెలుగు లోగిళ్లలో సంక్రాంతి పండుగకు ప్రత్యేక స్థానం ఉందన్నారు. పేద, ధనిక తేడా లేకుండా మూడు రోజుల పాటు పండుగను అందరూ సంతోషంగా జరుపుకుంటారని, దీన్ని దృష్టిలో పెట్టుకుని అత్యంత దయనీయంగా జీవనం గడుపుతున్న కుటుంబాలకు నిత్యావసర సరుకులను అందజేస్తున్నామన్నారు. చారిటీ బాక్సు ఆవిర్భావం నుంచి ఇప్పటి వరకు నిరుపేదలకు ఎన్నో సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు.

గెలిచిన కోడి.. తలొగ్గిన ఖాకీ..

- బరితెగించి యథేచ్ఛగా కోడిపందేలు
- తణుకు, గూడెం డివిజన్లలో జోరుగా జూద క్రీడలు



తాడేపల్లిగూడెంలో కోళ్ల పందేల దృశ్యం

తణుకు అర్బన్: కోడి పందేలు నిర్వహించేందుకు నిర్వాహకులు భారీగా ఏర్పాట్లు చేస్తున్నప్పటికీ పోలీసులు మాత్రం కోడి పందేలు జరగనివ్వమని మైకుల్లో ప్రచారంతోపాటు బరుల్లో ఫ్లెక్సీలు ఏర్పాటుచేసి హంగామా చేసినప్పటికీ సోమవారం ఉదయం నుంచి ఎటువంటి టెన్షన్ లేకుండా కోడి పందేల బరులు ప్రారంభమయ్యాయి. కోళ్ల కాళ్లకు కత్తులు కట్టి యథేశ్ఛగా కోడి పందేలు నిర్వహించిన తీరు పోలీసులు, రెవెన్యూ అధికారులు గత నాలుగు రోజులుగా చేసిన హడావుడి హాస్యాస్పదంగా మిగిలింది. కోడి పందేల బరుల ఆవరణలో గుండాట, కోతాట వంటి జూద క్రీడలు కూడా బహిరంగంగానే జరగడం విశేషం. నియోజకవర్గంలో 24 బరులు నిర్వహించారు. ముఖ్యంగా తేతలిలో జాతీయ రహదారిపై నిర్వహించిన భారీ బరిలో దూర ప్రాంతాల నుంచి సైతం కోడి పందాలరాయుళ్లు తరలివచ్చారు. భారీ సంఖ్యలో కార్లలో బిగ్‌షాట్‌లు తరలిరావడంతో పందేలు సైతం భారీ మొత్తంలో జరిగినట్లు సమాచారం.

తణుకు నియోజకవర్గంలో 24 బరులు..

తణుకు నియోజకవర్గంలోని తణుకు పట్టణంలో 5, రూరల్ పరిధిలో 7, అత్తిలి మండలంలో 5, ఇరగవరం మండలంలో 7 బరులు నిర్వహించారు. బరుల ప్రాంతంలో ఎప్పటిలాగే పోలీసులు ప్రేక్షకపాత్ర పోషించడం షరా మమూలే అన్నట్లుగా బరులు సాగాయి. అయితే ఈ కోడి పందేల బరుల ప్రాంతాల్లో విచ్చలవిడిగా మద్యం అమ్మకాలతో మందుబాబులు తాగుతూనే ఉన్నారు. తేతలిలో కోడి పందేల బరి వద్ద ఫోన్‌పే చేస్తే క్యాష్ ఇస్తామంటూ బోర్డులుపెట్టి మరీ నగదు ఇస్తుండడం విశేషంగా మారింది. వెయ్యికి రూ. 50లు కమిషన్ మీద డబ్బులు ఇస్తామని చెబుతున్నారు.

బరితెగించారు...

తాడేపల్లిగూడెం: కూటమి నాయకుల అండతో కోడి పందేల రాయుళ్లు బరితెగించారు. నియోజకవర్గంలో ఎక్కడ కావాలంటే అక్కడ బరులు వేసుకొని భోగి పండుగ సందర్భంగా సోమవారం కోళ్ల పందేలకు శ్రీకారం చుట్టారు. గడచిన 20 ఏళ్ల కాలంలో ఎన్నడూ లేని విధంగా ఈ సారి నియోజకవర్గంలో ఏకంగా 25 బరుల్లో పందేలు తొలిరోజు జరిగాయి. లక్షల రూపాయలు చేతులు మారాయి. పోలీసులు ప్రేక్షకపాత్రకు పరిమితమయ్యారు. కోళ్ల పందేలతో పాటు గుండాటలు చెలరేగి ఆడారు. గూడెం పట్టణంలో ఏరియా ఆసుపత్రి వెనుక భాగం సమీపంలో ఏర్పాటు చేసిన పెద్దబరికి పలు జిల్లాల నుంచి పందెం రాయుళ్లు హాజరయ్యారు. లక్షల నుంచి కోటి రూపాయల వరకు ఒక్కొక్క పందేనికి సొమ్ములు చేతులు మారాయి. ఈ బరిని ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాసు సందర్శించారు. సాంప్రదాయ పందేల ముసుగులో కోళ్లకు కత్తులు కట్టి పందేలు వేశారు. కూటమి నాయకులు గ్రీన్ సిగ్నల్ ఇచ్చిన చోట యథేచ్ఛగా పందేల జోరు కొనసాగింది. గత ఏడాది కేవలం పదికి లోబడి మాత్రమే కోడి పందేల బరులు ఉండగా, ఈ సారి 25కు చేరుకున్నాయి. గూడెం పట్టణంలో కూటమి భాగస్వామి పార్టీకి చెందిన నాయకుడే చక్రం తిప్పారు. తాడేపల్లిగూడెం పట్టణ పోలీసు స్టేషన్ పరిధిలో ఏరియా ఆసుపత్రి వెనుక, ఒక యువనేత సారథ్యంలో భాగ్యలక్ష్మి పేటలో పందేలు వేశారు. గూడెం రూరల్ పోలీసు స్టేషన్ పరిధిలో 15 చోట్ల పందేలు జరిగాయి. కొండ్రుపోలు, పెదతాడేపల్లి, కడియద్ద, పట్టింపాలెం, బంగారుగూడెం, లింగారాయుడు గూడెం, మెట్ట ఉప్పరగూడెం, కృష్ణాయపాలెం, మారంపల్లి, పడాలలలో వివిధ బరుల్లో పందేలు సాగాయి. పెంటపాడు పోలీసు స్టేషన్ పరిధిలో 8 చోట్ల పందేలు జోరుగా వేశారు. పెంటపాడు, అల్లంపురం, పడమర విప్పర్రు, జట్లపాలెం, మీనవల్లూరు, రామచంద్రపురం, రాచర్ల, దర్శిపర్రు, ప్రత్తిపాడు గ్రామాల్లో కోడి పందేలు జరిగాయి. బరుల వద్ద బెట్టింగ్ కౌంటర్లను ఏర్పాటు చేశారు.



ఇరగవరం: కోడి పందేల బరిలో గుండాట ఆడుతున్న దృశ్యం



తణుకు అర్బన్: తేతలిలో కోడి పందేల బరి వద్ద ఫోన్‌పే చేస్తే క్యాష్ ఇస్తామంటూ బోర్డులు



తణుకు అర్బన్: తేతలిలో భారీ కోడి పందేల బరి

● సంక్రాంతి సందడి



తణుకు అర్బన్: సంక్రాంతి వేడుకల్లో బసవన్నతో కారుమూరి సునీల్‌కుమార్, పార్టీ శ్రేణులు



పెంటపాడు: ప్రత్తిపాడులో ముగ్గుల పోటీలో విజేతకు బహుమతి అందజేస్తున్న దృశ్యం



పెంటపాడు: ఉమామహేశ్వరం గ్రామంలో బొమ్మల కొలువు దృశ్యం



తణుకు అర్బన్: ఎస్‌కేఎస్ఆర్ / ఎస్సీఐఎం ప్రభుత్వ డిగ్రీ కళాశాల క్రీడా ప్రాంగణంలో భోగి మంట వేసిన వాకర్స్



తాడేపల్లిగూడెం(టీఓసీ): వాకర్స్ ఆధ్వర్యంలో సంక్రాంతి సంబరాలు



తాడేపల్లిగూడెం రూరల్: చినతాడేపల్లి గ్రామంలో సంక్రాంతి సంప్రదాయాలను ప్రదర్శిస్తున్న దృశ్యం



అత్తిలి: డిగ్రీ కళాశాలలో వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో భోగి మంట వెలిగిస్తున్న దృశ్యం

తాడేపల్లిగూడెం, తణుకు నియోజకవర్గాలోని పలు గ్రామాల్లో సోమవారం సంక్రాంతి సంబరాలను ఘనంగా నిర్వహించారు. ముందుగా సంబరాలను భోగి మంటలు వెలిగించి ప్రారంభించారు. సంప్రదాయ దుస్తులతో సందడి చేశారు. బొమ్మల కొలువు సెట్టింగ్‌లు ఆకట్టుకున్నాయి. డూడూ బసవన్నల విన్యాసాలు, కోలాటం, హరిదాసులు, కొమ్ముదాసరులు, సోదెమ్మ, పిట్టలదొర, దేవతామూర్తుల వేషధారణలు ఆకట్టుకున్నాయి. - సాక్షి, నెట్‌వర్క్

ఘనంగా శ్రీదేవి మహంకాళమ్మ జాతర మహోత్సవాలు

తాడేపల్లిగూడెం (టీఓసీ): స్థానిక కొబ్బరితోట శ్రీదేవి మహంకాళమ్మ తల్లి 45వ వార్షికోత్సవ జాతర మహోత్సవాలు సోమవారం నుంచి ఘనంగా ప్రారంభమయ్యాయి. ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్ రథోత్సవాన్ని ప్రారంభించారు. జిల్లా అర్చక సమాఖ్య అధ్యక్షుడు కొడవటిగంటి నరసింహాచార్యుల ఆధ్వర్యంలో పూజలు చేశారు.

కోడిపందేల శిబిరాలపై పోలీసుల దాడి

తాడేపల్లిగూడెం రూరల్: కోడిపందేల శిబిరాలపై దాడి చేసి, పలువురిని అదుపులోకి తీసుకున్నట్లు రూరల్ పోలీసులు తెలిపారు. సోమవారం పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మండలంలోని కడియద్ద గ్రామంలో ముగ్గురిని అదుపులోకి తీసుకుని, వారి వద్ద నుంచి రూ.1200లు నగదు, ఒక కోడి పుంజు, రెండు కోడి కత్తులు స్వాధీనం చేసుకున్నారు. అలాగే, మోదుగ గుంట గ్రామంలో ముగ్గురిని అదుపులోకి తీసుకొని వారివద్ద నుంచి రూ.1120లు నగదు, ఒక కోడి పుంజు, రెండు కోడి కత్తులు సీజ్ చేశారు. పెదతాడేపల్లిలో ముగ్గురిని అదుపులోకి తీసుకొని, రూ.1330లు నగదు, ఒక కోడి పుంజు, రెండు కోడికత్తులను స్వాధీనం చేసుకున్నారు. కృష్ణాయపాలెంలో ముగ్గురిని అదుపులోకి తీసుకొని వారి వద్ద నుంచి రూ.1170లు నగదు, ఒక కోడిపుంజు, రెండు కోడికత్తులను స్వాధీనం చేసుకున్నట్లు రూరల్ పోలీసులు తెలిపారు.

పేకాట శిబిరంపై దాడి

మండలంలోని మెట్ట ఉప్పరగూడెం గ్రామంలో పేకాడుతున్న ముగ్గురిని అదుపులోకి తీసుకుని, వారి వద్ద నుంచి రూ.1200లు నగదు, 52 పేక ముక్కలు స్వాధీనం చేసుకున్నట్లు రూరల్ ఎఎస్సై పీవీకే.దుర్గారావు తెలిపారు.

బెల్ట్‌షాపు నిర్వాహకుడి అరెస్టు

పెంటపాడు: గ్రామాల్లో అక్రమంగా బెల్ట్‌షాపుల పేరిట మద్యం అమ్మితే చర్యలు తప్పవని ఎక్సైజ్ సీఐ స్వరాజ్యలక్ష్మి తెలిపారు. సోమవారం అలంపురం గ్రామంలో అక్రమంగా మద్యం విక్రయిస్తున్న వ్యక్తిని అరెస్టు చేసినట్లు తెలిపారు. ఈ దాడిలో సబ్ ఇనస్పెక్టర్ మురళి, దొరబాబు, సిబ్బందితో తదితరులు పాల్గొన్నారు.

భోగి మంటల్లో విద్యుత్ బిల్లుల దహనం



సీపీఎం ఆధ్వర్యంలో విద్యుత్ బిల్లులు దహనంలో పాల్గొన్న నాయకులు

తణుకు అర్బన్: కూటమి ప్రభుత్వం పెంచిన కరెంట్ చార్జీలు వెంటనే తగ్గించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి పీవీ. ప్రతాప్ డిమాండ్ చేశారు. సోమవారం తణుకులో సీపీఎం రాష్ట్ర కమిటీ ఇచ్చిన పిలుపు మేరకు పలు ప్రాంతాల్లో విద్యుత్ బిల్లులను భోగి మంటలలో వేశారు. ఈ సందర్భంగా ప్రతాప్ మాట్లాడుతూ పెంచిన విద్యుత్ చార్జీలు తగ్గించాలని, ప్రజలపై బారాలు ఆపాలని పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. సీపీఎం కార్యదర్శి ఏ.అజయ కుమారి మాట్లాడుతూ ప్రజల జీవన పరిస్థితులు పట్టించుకోకుండా అధికారంలోకి రాగానే విద్యుత్ చార్జీల రూపంలో భారం మోపడం దారుణమని అన్నారు. గార రంగారావు, రాము, రాధాకృష్ణ, సూర్యనారాయణ, మోహన్, నిఖిల్ తేజ్, అనురాధ, చిట్టెమ్మ, అన్నపూర్ణ, లక్ష్మి దేవి, గుబ్బల గోపి, యన్‌వి. బాబు, అనంత లక్ష్మి, గార వెంకాయమ్మ తదితరులు పాల్గొన్నారు.

నవాబుపాలెంలో సీపీఎం నిరసన

తాడేపల్లిగూడెం రూరల్: విద్యుత్ బిల్లులకు వ్యతిరేకంగా మండలంలోని నవాబుపాలెం గ్రామంలో సోమవారం సీపీఎం పార్టీ నిరసన కార్యక్రమం నిర్వహించింది. ఈ సందర్భంగా విద్యుత్ బిల్లులను భోగి మంటల్లో వేసి దగ్ధం చేశారు. అనంతరం సీపీఎం నాయకుడు కండెల్లి సోమరాజు మాట్లాడుతూ ఆరు నెలలకు ముందు కూటమి ప్రభుత్వం కరెంటు చార్జీలు పెంచబోమని, తగ్గిస్తామని నమ్మబలికి అధికారంలోకి వచ్చిందన్నారు. ఈ నిర్ణయాలను విరమించుకోవాలని డిమాండ్ చేశారు. కండెల్లి విజయ, ఆర్. అనూష, కండెల్లి రమేష్, నేకూరి జయ, ఉండ్రాజవరపు రాహేలమ్మ, కండెల్లి కుమారి, నేకూరి ధనమ్మ, నిచ్చెనకోళ్ల సూర్యచంద్రం పాల్గొన్నారు.

పెంచిన చార్జీలను ఉపసంహరించుకోవాలి

తాడేపల్లిగూడెం (టీఓసీ): విద్యుత్ ట్రూ అప్ చార్జీలు, సర్దుబాటు చార్జీలు, సర్ చార్జీలు తక్షణమే ఉపసంహరించుకోవాలని సీపీఎం జిల్లా కార్యదర్శి కర్రి నాగేశ్వరరావు కూటమి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం స్థానిక బ్రహ్మానందరెడ్డి మార్కెట్ వద్ద విద్యుత్ బిల్లులను భోగిమంటలలో వేసి దహనం చేశారు.